ఖరీఫ్ ముగిసి.. నిరీక్షణ మిగిలి

ఖరీఫ్ సీజన్‌కు ముగింపు దశకు చేరుతోంది. సబ్బవరం మండలంలో ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితుల వల్ల వరినాట్లు ఆలస్యం కావడంతో, కోతలు, నూర్పుల్లో కూడా జాప్యం నెలకొంది. దీనికి తోడు డిసెంబర్ రెండో వారంలోకి వస్తున్నా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. గతంలో నవంబర్ నెలాఖరు నుంచే కొనుగోలు కేంద్రాలు సిద్ధంగా ఉండేవి. మరోవైపు రానున్న వారంలో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి, వాయుగుండంగా మారి, వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో నూర్పులకు రైతులు ధైర్యం చేయలేకపోతున్నారు.


అనకపల్లిలో పండిన వరి పంటను కల్లాలకు తరలించే పనిలో రైతులు


అమృతపురంలో పండిన పంటను పొలంలోనే కుప్పలు పెడుతున్న రైతులు

- సబ్బవరం మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యం 4,532 క్వింటాళ్లు
- ఇంకా ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- రెండు, మూడు వారాల్లో ప్రారంభిస్తాం-అధికారులు
- రైతు సేవా కేంద్రాలే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

సబ్బవరం: మండలంలో ఖరీఫ్ వరి సాగు చేసిన రైతుల్లో ఆందోళన కొనసాగుతోంది. పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నా.. నూర్పులకు మాత్రం సాహసించలేకపోతున్నారు. ఫెంగల్ తుపాను హెచ్చరికలతో కోతల్ని వాయిదా వేసుకున్న రైతులు ఇప్పుడిప్పుడే బిజీ అయ్యారు. ఈ వారంలో మళ్లీ వర్షాలు పడతాయన్న హెచ్చరికలతో కోతలు పూర్తి చేసి, వ్యవసాయ క్షేత్రాల్లోనే కుప్పలు వేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో ఖరీఫ్ సీజన్లో 3,450 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. ప్రస్తుతం 1,075 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. ప్రస్తుత పరిస్థితుల ఆధారంగా ఈ నెలాఖరు లేదా జనవరికి గానీ నూర్పులు పూర్తయి, ధాన్యం అమ్మకాలు జరిగేలా లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు.

సేకరణ లక్ష్యం 4,532 క్వింటాళ్లు

గతేడాది మండలంలోని రైతుల నుంచి 4,120 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ ఏడాది మరో 10 శాతం పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా. ఆ మేరకు ఈసారి 4,532 టన్నుల ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ధారించారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల పరిధిలో 17 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేయనున్నట్లు వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. వీటిని క్లస్టర్లుగా విభజించి, ప్రతి కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యత, నిర్ధారణ, నమోదు కోసం ఒక్కో డేటా ఎంట్రీ ఆపరేటర్(డీఈవో), టెక్నికల్ అసిస్టెంట్(టీఏ), హెల్పర్ విధులు నిర్వహించనున్నారు. వీరు రైతుల కల్లాల వద్దకే వచ్చి ధాన్యం శాంపిళ్లు సేకరించి, రైతు సేవా కేంద్రాల్లో తేమ శాతాన్ని పరీక్షిస్తారు.

తేమ ఆధారంగానే కొనుగోళ్లు

ధాన్యం నూర్పిడి అనంతరం ముందుగా తేమను లెక్కిస్తారు. కోత సమయంలో సుమారు 30 శాతంగా ఉండే తేమ, ఆరబెట్టి, నూర్పులు చేశాక తగ్గుతుంది. ఈ తేమ 17 శాతం ఉంటేనే మిగిలిన పరీక్షలు చేస్తారు. అన్ని పరీక్షలు నిర్వహించాకే కొనుగోలు ప్రక్రియ మొదలవుతుంది. ప్రొడక్ట్ సప్‌లై ఏజెన్సీ వారు గోనె సంచులు, లేబర్, వెహికల్‌ను పంపిస్తారు. గతంలో మండలానికి కేటాయించిన నాలుగైదు మిల్లుల్లో ఏదో ఒక మిల్లుకు ధాన్యాన్ని రైతులు పంపించేవారు. ప్రస్తుతం రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం పంపించే వెసులుబాటు కల్పించినట్లు వ్యవసాయ అధికార్లు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ షెడ్యూల్ ప్రాప్తికి రైతులు ధాన్యం తీసుకుని వెళ్లాలి. దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

నూర్పులకు వెనుకంజ

చాలా వరకు వరి కోతలు చివరికొస్తున్నా వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ధాన్యం నూర్పులకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఫెంగల్ తుపాను ప్రభావంతో గత నెలాఖరు నుంచి ఈ నెల ప్రారంభం వరకు ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. వ్యవసాయాధికారుల హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలకు విరామం ప్రకటించారు. ఇప్పటికీ వాతావరణం మబ్బులుపట్టి ఉండటం, పైపెచ్చు మండలంలో ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత లేకపోవడంతో రైతులు వెనుకడుగు వేస్తున్నారు. నూర్పిడి ముగిశాక వర్షాలు కురిస్తే ధాన్యం విక్రయించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని భావిస్తున్నారు. మరోవైపు ఈ వారంలో నైరుతి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందన్న వార్తలతో రైతుల్లో ఒకింత ఆందోళన కొనసాగుతోంది.

ధాన్యం మద్దతు ధర, ఇతర చార్జీలు
సాధారణ రకం(క్వింటాల్) రూ.2,300
ఎ గ్రేడ్ రకం(క్వింటాల్) రూ.2,320
లేబర్ చార్జీలు(క్వింటాల్) రూ.17.17
ఒక గోనె సంచి(40 కిలోలు) రూ.3.30
రవాణా చార్జీలు ప్రభుత్వానివే

తుపాను వల్ల కోత ఆలస్యం



నాకున్న 70 సెంట్లలో వరి సాగు చేస్తున్నా. ఈ సంవత్సరం వర్షాలు ఆరంభంలో కాస్త ఇబ్బందిపెట్టినా, ఆ తర్వాత బాగానే కురిశాయి. వారం కిందటే కోత దశకు వచ్చినా, తుపాను హెచ్చరికలతో కోతను వాయిదా వేసుకున్నాను. తుపాను ప్రభావం తగ్గడంతో, కోత కోసి, పొలంలోనే కుప్పలు వేశాం. వీలు చూసుకుని, నూర్పులు చేపట్టి పంటను ఇంటికి తెచ్చుకోవాల్సి ఉంది.

– కోన రాముడు, రైతు, రాయపుర అగ్రహారం

ఆ తర్వాతే నూర్పులు!



నాకున్న 1.20 ఎకరాల్లో ఆర్జే ఎల్ రకం వరి సాగు చేశా. వాతావరణం అనుకూలించడంతో పంట ఆశాజనకంగా ఉంది. ఏటా పండిన పంటలో సొంతానికి కొంత ఉంచుకుని, మిగిలిన ధాన్యాన్ని విక్రయించేవాడిని. గతేడాది ప్రభుత్వం ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది. ఈ ఏడాది డిసెంబర్ వచ్చినా.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. అవి ప్రారంభమయ్యాకే నూర్పులు చేపడతాం.

– బోకం శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు



ధాన్యం సేకరణపై సిబ్బందికి ఇటీవలే శిక్షణ ఇచ్చాం. ధాన్యం తేమ, నాణ్యత పరీక్షలతో పాటు తూనిక యంత్రాలు, గోనె సంచులు మొదలైన వాటిని సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతులకు నగదు చెల్లించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. రైతుల కల్లాల నుంచి ధాన్యం తరలించేందుకు అవసరమైన గోనె సంచులు, రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుంది.

– పోతల సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి, సబ్బవరం

క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

విస్తం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 15 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శివకుమార్, సిబ్బంది

పెందుర్తి: మండలంలోని పినగాడి వెల్ఫేర్ ఇంజినీరింగ్(విస్తం) కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎక్స్ టెక్స్ టెస్టింగ్ కంపెనీలో ఉద్యోగాలకు 15 మంది ఎంపికయ్యారు. మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులకు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్ చేపట్టారు. కంపెనీ అధినేత హర్‌ప్రీత్‌సింగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.శివప్రసాద్, నేషనల్ కెరీర్ సర్వీస్ ప్రతినిధి శ్యామ్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారులు ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి.అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదు'


గోవింద్ పట్నాయక్

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం కార్మికుల జీవితాలతో ఆడుకుంటోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్ పట్నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేసే ప్రభుత్వాలు వారి ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. వేజ్ రివిజన్ ప్రకారం కార్మికులందరికీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బోనస్ బకాయిలను కూడా తక్షణమే అందజేయాలన్నారు. రాష్ట్రంలోని మేజర్ పోర్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

అప్పన్న అన్నదానానికి విరాళం


దాత శీర లక్ష్మి బంధువులకు బాండ్ అందిస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్న ప్రసాద పథకానికి శుక్రవారం సింహాచలంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంతానికి చెందిన శీర లక్ష్మి రూ.లక్ష విరాళాన్ని అందించారు. సంబంధిత విరాళాన్ని దాత కుటుంబీకులు డీడీ రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కు ఇచ్చారు. దేవస్థానం తరఫున అన్నప్రసాద బాండ్‌ని అందించారు. స్వామివారి దర్శనాన్ని కల్పించి, ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు. అన్నప్రసాద విభాగం సూపరింటెండెంట్ సునీల్ పాల్గొన్నారు.

9 నుంచి రెవెన్యూ సదస్సులు

పరవాడ: మండలంలో ఈ నెల 6 నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులను అనివార్య కారణాల వలన 9వ తేదీకి మార్పు చేసినట్లు తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ చెప్పారు. 9న రావాడలో నిర్వహించే సదస్సును స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ప్రారంభిస్తారన్నారు.

రెవెన్యూ సదస్సులు వాయిదా

పెందుర్తి: పెందుర్తి మండలంలో శుక్రవారం నుంచి జరగాల్సిన రెవెన్యూ సదస్సులు అనివార్య కారణాల వలన వాయిదా పడినట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. సదస్సులు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

మామిడి తోటల బీమా గడువు 15


పంటల బీమా కరపత్రాలను ప్రదర్శిస్తున్న అమృతఫల రైతులు

సబ్బవరం: పంటల బీమా ద్వారా వాతావరణంలో ప్రతికూల మార్పులతో పంట దిగుబడిరాక ఆర్థికంగా నష్టపోయే రైతులు ఉపశమనం పొందవచ్చని జిల్లా ఉద్యాన విభాగం అధికారి జి.ప్రభాకర్ తెలిపారు. సబ్బవరం అమృత ఫల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వద్ద కంపెనీ ఆధ్వర్యంలో వాతావరణ ఆధారిత మామిడి తోటల పంటల బీమా పథకం గురించి ఉద్యాన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్లో ఈ పథకాన్ని జిల్లాలోని మామిడి పంటలకు కూడా వర్తింపజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో అమలవుతున్న ఈ పథకంలో చేరేందుకు ఈ నెల 15 తుది గడువుగా పేర్కొన్నారు. ఈ బీమాలో చేరే మామిడి రైతులకు ఎకరాకు కనిష్టంగా రూ.33 వేలు నుంచి గరిష్టంగా రూ.45 వేలు వరకు పరిహారం పొందవచ్చన్నారు. ప్రీమియం రూపంలో ఎకరాకు రూ.1,650 నుంచి రూ.2,500 చెల్లించాలన్నారు. దగ్గర్లోని బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు, బీమా కంపెనీ నియమించిన ఎఫ్‌సీవోల ద్వారా లేకుండా పీఎంఎఫ్‌బీవై మొబైల్ యాప్‌లో కూడా బీమా పథకాన్ని నమోదు చేసుకోవచ్చన్నారు. బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డ్, భూమి పాస్‌బుక్ జెరాక్స్, పంట వేసిన ధ్రువీకరణ పత్రం తప్పనిసరన్నారు. కార్యక్రమంలో హెచ్‌వో కిరణ్మయి, అమృత ఎఫ్‌పీసీ సీఈవో కేఎల్ఎం మౌక్తిక, జిల్లా కో ఆర్డినేటర్ వెంకట గణేష్, ప్రతినిధి మోహన్, జాగృతి సంస్థ ద్వారా 6 మండలాల్లో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల కంపెనీల సీఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులో వ్యక్తికి రిమాండ్

సబ్బవరం: ట్యాంకర్ లారీతో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కేసులో పరారైన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పిన్నింటి రమణ శుక్రవారం వెల్లడించారు. వివరాలు. గత నెల 8న కోటపురట్లకు చెందిన మానేపల్లి సింహాద్రి(21) బంధువులింటికని తన ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. సబ్బవరం నుంచి పెందుర్తి వస్తుండగా చిన్నయ్యపాలెం వద్ద ట్యాంకర్ లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో సింహాద్రి అక్కడికక్కడే మరణించాడు. అయినప్పటికీ వాహనాన్ని ఆపకుండా ట్యాంకర్ లారీతో పాటు డ్రైవర్ పరమ్‌జిత్ సింగ్ పరారయ్యాడు. దీనిపై దర్యాప్తు జరిపి, ట్యాంకర్ లారీతో పాటు పరారైన నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

అలివేలు మంగమ్మకు ప్రత్యేక పూజలు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరినగర్‌లో వెలసిన అలివేలు మంగమ్మ సన్నిధిలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అమ్మవారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు 16 వారాల పూజలు ప్రారంభించగా.. మరి కొంతమంది ఆయా పూజలను శాస్త్రోక్తంగా ముగించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ఎన్నిక


గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నియామక పత్రాన్ని తహసీల్దార్‌కు అందిస్తున్న కార్యవర్గ సభ్యులు

సబ్బవరం: మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ఎన్నికలు జరిగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా కె.శేఖరరావును, ఉపాధ్యక్షుడిగా బి.అప్పలరాజును సభ్యులంతా కలిసి ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కె.అనంత్, సహాయక కార్యదర్శిగా కె.రుక్మిణి, కోశాధికారిగా వాత్సల్య రామ్, కార్యవర్గ సభ్యులుగా పీపీ జగన్నాథరావు, ఎన్.దేముడుబాబు, డి.ఈశ్వరరావు, ఎం.గోవిందరావు తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యుల నియామక పత్రాన్ని తహసీల్దార్ చిన్నికృష్ణకు సభ్యులు అందించారు.

వేంకటాద్రిపై 16 నుంచి ధనుర్మాసోత్సవాలు


వేంకటాద్రిపై నిర్మించిన వెంకన్న ఆలయం

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాసం సందర్భంగా గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజార్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 13న గోదా రంగనాయకుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో భాగంగా ధనుర్మాసం నెల రోజులూ వేకువ జామునే వేంకటేశ్వర సుప్రభాతం బదులు ఆండాళ్ విరచిత తిరుప్పావై పఠనం ఉంటుందన్నారు. ఉదయం పూజ అనంతరం బాల భోగం నివేదిస్తామన్నారు. జనవరి 1న స్వామి వారికి నవనీత సేవ, 5న సుదర్శన హోమం, సామూహిక కుంకుమ పూజలు, భారీ అన్నసమారాధన, 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని గిరి ప్రదక్షిణ, ఉత్తర ద్వార దర్శనం జరుగుతాయన్నారు. జనవరి 11న కూడార్తై ఉత్సవం, 12న తిరువీధి ఉత్సవం, 13న గోదా రంగనాయకుల కల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అంబేడ్కర్ మార్గం.. సదా అనుసరణీయం

- బాబాసాహెబ్ వర్ధంతి సందర్భంగా ఊరూవాడా ఘన నివాళి


రాంపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు


అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో పెందుర్తిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు


పెందుర్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, బీజేపీ నేత గొర్లె రామునాయుడు


అడవివరం అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కొలుసు ఈశ్వరరావు తదితరులు


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు


అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి అంజలి ఘటిస్తున్న ఎన్టీపీసీ ఐఎన్‌టీయూసీ యూనియన్ నేతలు



సింహాద్రి ఎన్టీపీసీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఓ అండ్ ఎం జీఎం జెనా

పెందుర్తి: బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం రాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమన్నారు. దేశానికి దిశ దశ నిర్దేశం చేస్తూ రాజ్యాంగాన్ని రూపొందించి జాతికి అందించిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. పార్టీ నేతలు ఉప్పిలి కనకరాజు, బోకం రామునాయుడు, మెంటి మహేష్, దాసరి సత్తిబాబు, చిరికి దేముడు, చందుయాదవ్, సబ్బవరపు నారాయణమూర్తి, బోను గంగునాయుడు, రొంగలి శంకర్, వేణు, ఐడీ దేముడు, దనింరెడ్డి శ్రీను, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

- పెందుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ ముమ్మన దేముడు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఘనంగా నివాళులర్పించారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.
- అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యుడు బోనెల యేసు జోసెఫ్, సంఘం నాయకులు టి.సుబ్బారాయుడు, జలగడుగుల శ్రీను, మంతెన అప్పారావు, చందుల వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు, రాఘవులు, మువ్వల రమణ, తదితరులు పాల్గొన్నారు.
- సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఆ పార్టీ సభ్యులు ఆసిరినాయుడు, ఎం.రాము, సిమ్మరావు, కృష్ణ, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని అడవివరంలోని అంబేడ్కర్ కాలనీలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ శ్రేణులు శుక్రవారం నిర్వహించారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, పార్టీ నాయకులు దమ్ము ఎర్రాజీరావు, తెడ్లపు మహేష్, కాలనీ అధ్యక్షుడు వంగలపూడి అప్పారావు, ఉపాధ్యక్షుడు నక్కిడాపు చంటి, కాలనీ నివాసితులు శివ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో భారతరత్న అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా వీసీ ఆచార్య డి.సూర్య ప్రకాశరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను భారత రాజ్యాంగ పితగా అభివర్ణిస్తూ, రాజ్యాంగ రచన కమిటీ అధ్యక్షుడిగా ఆయన సేవల్ని కొనియాడారు. అంబేడ్కర్ ఏ ఒక్క వర్గానికో సంబంధించిన వ్యక్తి కాదని, ఆయన అందరి వాడని పేర్కొన్నారు. ముఖ్యంగా అణగారిన వర్గాల కోసం అలుపెరుగని పోరాటం చేశారని, అందుకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించడంలో కృతకృత్యులయ్యారన్నారు. 8 గంటల పని, లేబర్ వెల్ఫేర్ ఫండ్ అనేవి ఆయన ఆలోచనలేనని వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడ: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని సింహాద్రి ఎన్టీపీసీ ఐఎన్‌టీయూసీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజేవీ లెనిన్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశానికి అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

- సింహాద్రి ఎన్టీపీసీలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతిని సంవాద్ భవన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంస్థ ఓ అండ్ ఎంజీఎం ప్రశాంత్‌కుమార్ జెనా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అంబేడ్కర్ గొప్పతనాన్ని, ఆయన అందించిన రాజ్యాంగ ఘనతను కొనియాడారు. కార్యక్రమంలో సీజీఎం సీపీజీ ఆర్.ఆర్.ఫరిదా, సీఅండ్ఎం జీఎం వీటీ కాంబ్లెల్, జీఎం నవాబ్, జీఎం టీఎస్, ఎస్.పద్మప్రియ, ఏజీఎం హెచ్‌ఆర్ బి.బి.పాత్ర, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, వివిధ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

11 నుంచి హనుమత్ వ్రతం ఉత్సవాలు


గుడిలోని హనుమంతుడి విగ్రహం

సింహాచలం: సింహగిరి మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 11 నుంచి 13 వరకు హనుమత్ వ్రతం ఉత్సవాలను నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. 11న ఉదయం 7.30 నుంచి 11.30 వరకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సుందరకాండ పారాయణం ఉంటాయన్నారు. 12న ఉదయం విశేష పూజలు జరుగుతాన్నారు. 13న ఉదయం 6 నుంచి 7 వరకు స్వామికి పంచామృతాభిషేకం, 7 నుంచి అలంకరణ, 7.30 నుంచి 9 వరకు లక్ష తమలపాకుల పూజ, 9 గంటల నుంచి పట్టాభిషేక పారాయణం, 9.30 నుంచి 10.30 వరకు విశేష హవనం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.